ప్రజాపతి ఉగాది (న్యూజెర్సీ) కథల పోటీలో రూ. 300/-లు బహుమతి పొందిన కథ

# ట్రీట్‌మెంట్

—శ్రీధర శ్రీరామకృష్ణ



జేబులోంచి ఫిల్టర్ సిగరెట్ తీసి వెలిగించి, రెండు దమ్ములు లాగి కింద పడేసి, నన్నెవరూ గమనించడం లేదని నిర్ధారణ చేసుకున్న తర్వాత, ఆ వీధిలోకి దారి తీసాను. ఆ వీధిలోకి వెళ్ళడం నాకు కొత్తేమీ కాదు. అలాగని మరీ అలవాటూ కాదు. సరళ పుట్టింటి కెళ్ళి నెలల తరబడి తిష్ఠవేస్తే ఏదో రకంగా ఆమె లేని లోటు తీర్చుకోవడం కోసం అప్పుడప్పుడు ఇలా రావడం తప్పనిసరి అవుతోంది. 'సరళకి ద్రోహం చేస్తున్నానా' అన్న ఆలోచన నాకు రాకపోలేదు. కానీ నా బలహీనత ఆ ఆలోచనను డామినేట్ చెయడంతో ఎలాగోలా మనసుకు సర్దిచెప్పుకుంటూంటాను.

ఈ రోజు మధ్యాహ్నమే సరళ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. వాళ్ళ అన్నయ్య పెళ్ళికి ముహూర్తం నిశ్చయమైందట. అందుకని ఈ నెల కూడా అక్కడే వుండి పెళ్ళయ్యాక ఏకంగా ఒకేసారి వస్తుందట. నన్ను కూడా పెళ్ళికి రమ్మని ప్రేమతో ఆహ్వానించింది. వెడ్డింగ్ కార్డులు ప్రింటయ్యాక పంపుతుందట. నేను తిండి శ్రద్ధగా తింటూ, క్లినిక్ రెగ్యులర్‌గా తెరుస్తూ, జాగ్రత్తగా వుండాలట. ఇదీ ఉత్తరం లోని సారాంశం.

నిజంగా సరళ మీద పీకలదాకా కోప మొచ్చింది. నా అలవాట్లూ, బలహీనతలూ సరళకు బాగా తెల్సు. అయినా తను రావడం ఆలస్యం చేస్తోందంటే ఏమనుకోవాలి? వచ్చేసి, పెళ్ళికి మళ్ళీ వెళ్ళకూడదూ!

'బాగున్నారా బాబూ!' పలకరించాడు ఏసోబు నా ఆలోచనా స్రవంతికి అడ్డుకట్ట వేస్తూ.

'ఊ!' ఆలోచనల్లోంచి తేరుకుని 'ఏంటే, బిజినెస్ ఎలా వుంది' బాగుండదని అడిగాను.

'ఏం బిజినెస్ బాబూ! రాబడిలో చాలా మట్టుకు పోలీసోళ్ళే మింగేస్తున్నారు' అన్నాడు. వాడి బాధ వాడిది.

జేబులోంచి ఐదు నోటు తిసి ఏసోబు కిచ్చాను.

'నడవండి బాబూ! ఇప్పుడే వచ్చేస్తాను' అంటూ ఏసోబు ముందుకు కదిలాడు.

అసలీ ఏసోబుతో పరిచయం ఒకసారి అనుకోకుండా జరిగింది.

* * *

ఆ రోజు సరళని గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కించి, సెకండ్ షో చూట్టానికని 'సరస్వతీ థియేటర్' కెళ్ళాను. టిక్కెట్లివ్వటానికి ఇంకా టైముండడంతో, సిగరెట్ కొనుక్కుందామని కిళ్ళీకొట్టు దగ్గరకు వెళ్ళబోతుండగా, నా కాళ్ళు అప్రయత్నంగా ఓ చోట ఆగిపోయాయి. ఓ నలభై ఏళ్ళ మగ మనిషితోబాటు నలుగురు అమ్మాయిలు నుంచుని వున్నారు. వాళ్ళల్లో వాళ్ళు కబుర్లు చెప్పుకుంటూ విరగబడి నవ్వుకుంటున్నారు. కొద్దిగా పూర్వానుభవం వుండడం వల్ల వాళ్ళు అదే ట్రేడ్ మార్క్ అని ఇట్టే పసిగట్టేసాను. జనం చాలామంది వుండడంతో, ఓ పక్కన నుంచుని ఓరకంటితో వాళ్ళని గమనిస్తూ, గమనించనట్టు నటించసాగాను. కానీ ఆ అమ్మాయిలకు తోడుగా వచ్చిన ఆ నలభై ఏళ్ళ మనిషి నన్ను గమనించినట్టున్నాడు. దగ్గరకు వచ్చాడు. అతనితో మాట్లాడ్డం నాకు సుతరాం ఇష్టం లేదు.

'నా పేరు ఏసోబు బాబూ' తనను తాను పరిచయం చేసుకుంటూ చిరునవ్వుతో అడిగాడు — 'అగ్గిపెట్టె ఓసారిస్తారా!' అని.

అగ్గిపెట్టె అందించాను.

'ఏం బాబూ! అమ్మగారు ఊళ్ళో లేరా?' అతనే ఇనీషియేటివ్ తీసుకున్నాడు.

'అవును. లేరు..లేరు' అతని చొరవకి ఆశ్చర్యపోతూ, కాస్త తడబడ్డాను.

'అదీ విషయం. పిల్లలు బావుంటారు బాబూ! ఏ క్లాస్! సినిమా అయ్యాక సెంటర్లో నుంచోండి' ఇంచుమించు ఆజ్ఞాపిస్తున్నట్టని, వాళ్ళని తీసుకుని థియేటర్‌లోకి వెళ్ళిపోయాడు.

వాళ్ళ వెనకాలే నేనూ థియేటర్‌లోకి నడిచాను. నా సీటు నెంబరు వేరే కావడంతో వాళ్ళు నా సీటుకి దూరంగా కూర్చున్నారు. సినిమా అయిపోయాక ఇంటి కెళ్ళిపోదామనిపించింది. కానీ సెంటర్‌దాకా వెళ్ళేటప్పటికి అడుగులు ముందుకు పడలేదు. అలా అనడం కన్నా నా బలహీనత నన్ను ముందుకు సాగనివ్వలేదు అనడం సబబు.

ఓ రెండు నిముషాల తర్వాత ఏసోబు ఆ నలుగురిలో కాస్త అందంగా వున్న అమ్మాయితో బాటు నా దగ్గరగా వచ్చాడు. నేను రిక్షా ఎక్కి ఏసోబుకి ఓ వంద నోటు అందించాను. ఆ అమ్మాయి రిక్షా ఎక్కడం, రిక్షా ముందుకు సాగిపోవడం ఒకేసారి జరిగాయి.

* * *

'ఏం బాబూ! ఇక్కడే నిలబడిపోయారు' ఏసోబు పలకరింపుతో ఆలోచనల్లోంచి తేరుకుని ముందుకు నడవసాగాను. ఇంతలో ఇంకో గిరాకీ తగలడంతో నన్ను వదిలేసి వాళ్ళతో మాటల్లో పడ్డాడతను. మళ్ళీ సిగరెట్ వెలిగించి ముందుకు నడవసాగాను. షోకేసులో బొమ్మల్లా రోడ్డు కిరువైపులా గుమ్మాల మీద చాలా మంది ఆడాళ్ళు నుంచుని వున్నారు. వాళ్ళ మొహాల్లో నిర్లిప్తత, నిర్లక్ష్యం లాంటి భావాలు ఎన్నెన్నో వున్నాయి. చివరి ఇంటి దగ్గరకు నడిచి, గేటు తీసి లోపలికి అడుగు పెట్టాను.

నన్ను చూడగానే ఓ నడివయస్కురాలు లేచి నుంచుంది. నుదుట అర్ధరూపాయి కాసంత కుంకం బొట్టు, స్లీవ్‌లెస్ జాకెట్టు, జారిపోయిన కండలు, జడలో మల్లెపూల దండ, తాంబూలం ఎక్కువగా నమలడం మూలంగా ఎర్రపడ్డ పెదాలు, దగ్గరయ్యేకొద్దీ ఆమె వంటిమీంచి వెలువడే ఖరీదైన సెంటు వాసన, ఆమె ఆ ప్రొఫెషన్ కంపెనీకి ఓనరని చెప్పకనే చెబుతున్నాయి.

'బేగం! లక్ష్మీ! మేరీ! అందరూ బయటకు రండి' బొంగురుగా వున్న గొంతుతో అరిచిందామె. బిలబిలమంటూ ఓ పది మంది వచ్చి, నా ఎదురుగా నుంచున్నారు.

'చూసుకోండి బాబూ!' అందామె.

విచిత్రమైన కట్టూ బొట్టుతో వాళ్ళందరిలో ఒక రకమైన ఆకర్షణ కనబడుతోంది. వాళ్ళందరి

పటిష్టమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్



లోకి వివరగా నుంచున్న అమ్మాయి నా కళ్ళకు బాగా నచ్చింది.

ఆ అమ్మాయిని పంపమన్నట్టు సైగచేసి, నేను లోపలకి నడిచాను.

'గదిలోకి నడవండి' అందా అమ్మాయి నా వెనకాలే వస్తూ.

ఎదురుగా వున్న గదిలోకి దారి తీసి, ఆ గదిని ఒకసారి పరికించి చూసాను. సున్నం వెలిసిపోయి నట్టున్న గోడలు, ఓ పాత కాలం మంచం, దాని పైన బాగా మాసిపోయిన పరుపు, ఆ పరుపు మీద అక్కడక్కడా చిరిగిపోయి, మరకలతో వున్న ఓ దుప్పటి, ఓ పక్క స్టూల్ మీద మురికి పట్టిన ప్లాస్టిక్ వాటర్ జగ్, ఓ గాజు గ్లాసు వున్నాయి. గూట్లో వత్తి బాగా తగ్గించి వెలిగించిన దీపం వుంది.

ఇంతలో తలుపు గడియవేసి దగ్గరగా వచ్చిందామె.

'నీ పేరేమిటి?' అడిగాను.

'లక్ష్మి' అందామె.

నిజానికి లక్ష్మి అందగత్తే. కానీ ఎందుకో ఆమెలో ఉండాల్సినంత ఆకర్షణ లేదు. తల దువ్వుకుని, వదులుగా జడ వేసుకుంది. కాస్త పౌడరు రాసుకుని, నుదుటి మీద పొడుగ్గా తిలకం బొట్టు దిద్దుకుని వుంది. నేత చీర, జాకెట్టు. అంతకంటే ఎక్కువ హంగులేమీ లేవు. చేతికి సాదా గాజులు మాత్రం వేసుకుని వుంది.

ఈ పరుపు మీద, ఈ గదిలో రాత్రంతా గడపడం అంటే సాధ్యం అయ్యే పనేనా! లక్ష్మిని నాతోబాటు తీసుకుపోతే సరి! ఎలాగో నే క్లినిక్ పెట్టుకున్న బిల్డింగ్ ఊరికి కాస్త దూరంగా, ఐసొలేటెడ్‌గా వుంది. అదే బెటరనిపించింది.

'లక్ష్మి! ఇక్కడ కాదు. నాతోబాటు వస్తావా నా రూమ్‌కి వెళ్ళిపోదాం. నేను మీ ఓనరుతో మాట్లాడుతాను' అన్నాను.

విప్పిన జాకెట్టు బొత్తాలు పెట్టుకుంటూ అంది 'కుదరదు బాబూ. ఇక్కడైతేనే వీలవుతుంది.'

'చూడు లక్ష్మి. నీకు నా రూమ్‌లో ఎలాంటి ఇబ్బందీ కలగదు. తెల్లారి నేను స్వయంగా వచ్చి దిగబెడతాను' అభయమిస్తున్నట్టు అన్నాను.

'కుదరదు బాబూ! ఏమనుకోకండి' అందామె మళ్ళీ.

'ఏం నా మీద నీకు నమ్మకం కలగలేదా?'

'అది కాదు బాబూ! మా పెద్దబ్బాయికి వేడి వేడి కాఫీ నీళ్ళు పడి ఒళ్ళంతా కాలిపోయింది. చంటి పిల్లాడికి జ్వరం. ఇక్కడైతే మధ్య మధ్యలో వెళ్ళి చంటాడ్ని చూసుకురావచ్చు' అందామె. ఆమె కళ్ళల్లో కన్నీరు కదలాడింది.

'నీకు పిల్లలు కూడా వున్నారా?' బలహీనత స్థానంలో ఆశ్చర్యం చోటు చేసుకుంది నాలో.

'అవును బాబూ' అందామె.

'మరి మీ ఆయన...'

'ఎప్పుడో నన్ను వదిలేసి, ఇంకోదానితో వెళ్ళిపోయాడు' బాధగా అందామె.

'మరి పిల్లాడికి ఒంట్లో బాగోకపోతే, ఇక్కడికెందుకు రావడం?' కారణం తెల్సిందే అయినా ఆ ప్రశ్న అడగకుండా వుండలేకపోయాను.

'పొట్ట కోసం బాబూ! నా పొట్ట కోసం. నా పిల్లల పొట్ట కోసం' కళ్ళల్లోంచి ధారాపాతంగా కారిపోతున్న కన్నీటిని చీర చెంగుతో తుడుచుకుంటూ అందామె బరస్టయిపోయినట్టుగా.

అంతే! నాలో కోరిక పూర్తిగా చచ్చిపోయింది.

జేబులోంచి ఓ వంద నోటు తీసి, దానితో బాటు నా విజిటింగ్ కార్డు కూడా ఆమెకందించాను.

డబ్బు అయిష్టంగానే తీసుకుని, కార్డు చూపిస్తూ అడిగిందామె 'ఇదేంటి బాబూ!'

'అది నా విజిటింగ్ కార్డ్. నా పేరు, నా క్లినిక్ ఎడ్రస్సూ అందులో వున్నాయి. రేపు నీ పిల్లల్ని తీసుకుని తప్పకుండా నా క్లినిక్ రా! ఉచితంగా వైద్యం చేస్తాను' అంటూ ఆమె కళ్ళల్లోకి చూసాను. కన్నీటితో నిండిన ఆమె కళ్ళల్లో ఆ విచ్చిన రెండు కల్హార సరస్సుల్లో కృతజ్ఞతా భావం మెరిసింది.

నేనుబయటకు వచ్చేసాను.

'కావాలని కాకపోయినా, మొత్తానికి లక్ష్మి నా రోగానికి మందు వేసింది!

ఆమె పిల్లలకి ఉచితంగా వైద్యం చేసి, కృతజ్ఞత తీర్చుకోవాల్సిన అవసరం నాకు లేదూ మరి!'

■



